# అమెరికా సామ్రాజ్యవాదమా, కొరియా ద్వీపకల్పం వీడి వెళ్ళిపో




**అమెరికా** మరియు ఇతర సామ్రాజ్యవాదులు, తమ నియంత్రణలోనున్న ప్రచార మాధ్యమాలు కలగలిసి, ప్రపంచానికి ఓ గొప్ప విపత్తు కలిగించేందుకు అణ్వాయుధాలతో సంసిద్ధమైన భయంకరమైన రాక్షసునిగా కొరియాను చిత్రిస్తూ పకడ్బందీగా ప్రచారం చేస్తున్నారు. ప్రపంచం లోని అనేకమంది ఈ ప్రచారంతో గందర గోళానికి గురవుతుండగా, మరి అనేకమంది ప్రభావితులవుతున్నారు. ఈ ప్రచారానికి అమెరికా సామ్రాజ్యవాదులు నాయకత్వం వహిస్తున్నారని ప్రత్యేకించి పేర్కొనాల్సిన అవసరం లేదు.

అణ్వాయుధాలు శాంతికి తీవ్రవిఘాతం కల్గిస్తాయనేది నిజం. అయితే, ఈ ప్రపంచాన్ని పలుమార్లు ధ్వంసం చేయగలిగిన మోతాదులో ఈ ఆయుధాలను కలిగివుండటాన్ని తమ హక్కుగా అమెరికా మరియు ఇతర బడా సామ్రాజ్యవాద శక్తులు ఎందుకు భావిస్తున్నాయి? తమ వద్దనున్న ఆయుధాలతోసహా అణ్వాయుధా లన్నింటిపై సంపూర్ణ నిషేధం విధింపుకు వారెందుకు అంగీకరించలేకున్నారు? చిన్న దేశాలు తమ స్వీయరక్షణకోసం కొన్ని ఆయుధా లను కలిగివుండటంపై నిషేధం విధిస్తూ, అణ్వాయుధాలపై సామ్రాజ్యవాద దేశాలు తమ గుత్తాధిపత్యాన్ని సమర్థించుకోవటం, చిన్న దేశాలపై సామ్రాజ్యవాదశక్తులు ఆధిపత్య ధోరణులతో వ్యవహరించటం కాదా?! ప్రపంచం లోని ఏ చిన్న దేశం కూడా తమ స్వీయరక్షణ కోసమే అయినప్పటికీ, అణ్వాయుధాలను లేదా ఏ వినాశకర ఆయుధాలను ప్రయోగించినట్లు ఒక్క ఉదాహరణనైనా చూపగలుగుతారా? కానీ, సామ్రాజ్యవాద శక్తులు ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదులు తమ అపార ఆయుధశక్తిని ప్రదర్శిస్తూ, వారి ఆయుధాల భారాన్ని చిన్న దేశాలపై మోపి, వారిని నలిపివేసి, తమ స్వీయ ఆధిపత్యాన్ని వారిపై రుద్దుతూ వచ్చాయనే దానికి మనవద్ద అసంఖ్యాక ఉదాహరణలున్నాయి.

కనుక, అమెరికా మరియు ఇతర బడా సామ్రాజ్యవాద అణ్వాయుధశక్తుల వద్దనున్న ఆయుధాలను మొదట ధ్వంసం చేయమని అడిగే హక్కు న్యాయమైనది; పూర్తిగా ఆమోద యోగ్యమైనది.

**అమెరికా, ఉత్తరకొరియాలమధ్యనున్న వివాదము లేదా విభేధమేమిటి?**

1945 సం॥లో రెండవ ప్రపంచయుద్ధం ముగింపువరకూ, జపాన్ దురాక్రమణకు వ్యతిరేకంగా కొరియా ప్రజలు జాతీయ విముక్తి యుద్ధాన్ని సాగిస్తూ వచ్చారు. రెండవ ప్రపంచ యుద్ధంలో ఫాశిస్టుకూటమి ఎప్పుడైతే ఓటమి చవిచూసిందో, దానితో జపాన్ సామ్రాజ్య వాదులు రంగంనుండి తప్పుకున్నారు. అయితే, వారు వదిలిన చెప్పులలో కాళ్ళు దూర్చిన అమెరికా సామ్రాజ్యవాదులు, 1950 జూన్ 25న కొరియాను దురాక్రమించారు. కొరియా ప్రజానీకం చైనా వలంటీర్లతో కూడి అమెరికా దురాక్రమణకు వ్యతిరేకంగా పోరాటాన్ని కొనసాగించి వారికి ఓటమి తర్వాత ఓటమిని చవిచూపారు. అంతిమంగా 1953 జులై 27న అమెరికా సామ్రాజ్యవాదులు కొరియాతో ఆర్మిస్టైస్ ఒప్పందం చేసుకున్నారు. ఉత్తరకొరియాగా పిలవబడే కొరియా ఉత్తరభాగం కొరియన్ వర్కర్స్ పార్టీ నాయకత్వంలో 'డెమోక్రటిక్ పీపుల్స్ రిపబ్లిక్'గా అవతరించగా, దక్షిణకొరియాగా పిలవబడే కొరియా దక్షిణభాగం అమెరికా ఉపగ్రహదేశంగా వాస్తవికంగా కుదించబడింది. ఉత్తరకొరియా యుద్ధంచేసే అవకాశం వుందంటూ, ఆ యుద్ధాన్నుండి దక్షిణకొరియాను రక్షించే పేరిట అమెరికా 28,500 మంది సైనికులతో దక్షిణకొరియాలో బలమైన సైనిక స్థావరాన్ని ఏర్పరచుకుంది. కొరియాలో రెండువైపులనుండీ ఏకీకరణ కోర్కె బలంగా వుండగా, అమెరికా సామ్రాజ్యవాదులు దానికి పెద్ద అవరోధంగా నిలిచారు. దక్షిణకొరియాలో వారు నిరంకుశ ప్రభుత్వాలను పెంచి పోషించారు. వారు దక్షిణ కొరియాను సాయుధం చేసుకుంటూ వెళ్ళటంతో పాటు, రెండు ప్రాంతాల ప్రజల నడుమ ఉద్రిక్తతలను, శత్రుత్వాలను పెంచటంద్వారా దక్షిణకొరియాలో తమ స్థావరాన్ని శాశ్వతం చేసుకునే ప్రయత్నం, యుద్ధం లేదా ఇతర పద్ధతుల్లో ఉత్తరకొరియాను లోబరుచుకునే ప్రయత్నం చేస్తున్నారు.

ఆసియా పసిఫిక్ ప్రాంతంపైన, సముద్రం పైన తమ ఆధిపత్యాన్ని ఏర్పరచుకోవాలనే అమెరికా వ్యూహం, అమెరికా నాయకత్వంలో అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా, భారతదేశాల వ్యూహాత్మక కూటమి ఆవిర్భావం–అమెరికా యొక్క 'కొరియా విధానానికి' నూతన పార్శ్వాలను జోడించింది. దక్షిణకొరియాపై తన పట్టును కలిగివుంటూ, సంఘటిత పరచుకుంటూనే, రెండు కొరియాల నడుమ ఉద్రిక్తతలను, విభజనలను పెంపొందిస్తూ ఉత్తరకొరియాకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని మలచటం వారి ఈ విధానంలో అత్యావశ్యక భాగంగా ముందు కొచ్చింది.

అమెరికా విధానాన్ని ప్రతిఘటించటం, ఉత్తరకొరియా మనుగడకు అత్యావశ్యకమైంది. ఉత్తరకొరియా రెండు పార్శ్వాలున్న విధానాన్ని అనుసరిస్తున్నట్లుగా కనబడ్తోంది.

1. తాను చర్చలకు, హేతుబద్ధమైన ఒప్పందానికి సంసిద్ధంగా వున్నానని, అయితే తనను బెదిరించి లొంగదీసుకోవటం సాధ్యం కాదని అమెరికా సామ్రాజ్యవాదులకు తగిన విధంగా స్పష్టంచేయటం. ఆయుధ సంపత్తిలో అమెరికా ఆధిపత్యం,

ఉత్తరకొరియాను భయపెట్టలేకపోతోంది. ఉత్తరకొరియా కూడా అణ్వాయుధాలతో సహా ఆయుధాలన్నింటినీ ఉత్పత్తి చేయగలగటంతోపాటుగా, అమెరికా ఆ రూపంలో ముందుకొస్తే అదే రూపంలోనే సమాధానం చెప్పటానికి సిద్ధంగా వుంది. థాడ్ (టిహెచ్ఏఏడి) వ్యవస్థను దక్షిణకొరియాలో ఏర్పరచటాన్ని ఉత్తరకొరియా తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ నేపథ్యంలోనే అమెరికా, ఉత్తరకొరియా నాయకుల నడుమ ఎత్తులు, పైఎత్తులు, బెదిరింపులు, ప్రతిహెచ్చరికలు కొనసాగాయి. ఉత్తరకొరియాను తుడిచిపెట్టామని ట్రంప్ గర్జించాడు. దీనికి జవాబుగా ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ ఇలా హెచ్చరించాడు: "అమెరికా భూభాగమంతా మా అణ్వాయుధ దాడి పరిధిలో వుంది. దానికి సంబంధించిన మీట నా కార్యాలయంలోని టేబుల్‌పైనే వుంది. ఇది వాస్తవం; బెదిరింపు కాదు". ట్రంప్ ఇలా బదులిచ్చాడు: "నా వద్ద కూడా ఓ అణ్వాయుధ మీట వుంది. కానీ అది కిమ్ మీట కంటే చాలా పెద్దది; మరియు శక్తివంతమైందిగా పనిచేస్తుంది". ఇదంతా మాటల యుద్ధం. తన మాటలకు కార్యాచరణ రూపమిచ్చే ముందు అమెరికా కూడా అనేక అంశాలను పరిగణలోకి తీసుకోవల్సి వుంటుంది.

2. శాంతి మరియు కొరియా ఏకీకరణ లనేవి ఉత్తరకొరియా విధానపు మరో పార్శ్వంగా వుంది. దక్షిణకొరియాతో చర్చల కొరకు ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్‌జాంగ్ ఉన్ 2018 జనవరి 1న ఇచ్చిన పిలుపు ఈ నేపథ్యంలోనిదే. ఉత్తర, దక్షిణకొరియాలు రెండూ కొరియా ద్వీపకల్పంలో శాంతియుత వాతావరణం కల్పించేందుకు సైనిక ఉద్రిక్తతలను తప్పనిసరిగా తగ్గించుకోవాలని జిమ్ ప్రతిపాదించాడు. 2018 ఫిబ్రవరిలో దక్షిణకొరియాలో పియాంగ్ ఛాంగ్ నగరంలో జరిగే ఒలంపిక్ క్రీడలలో పాల్గొనేందుకు ఉత్తరకొరియా సంసిద్ధంగా వుందని కూడా అతను సూచించాడు.

ఈ పిలుపు మొత్తంగా కొరియా ప్రజల మధ్య ఐక్యత, ఏకీభావం అనే మృదువైన, లోతైన భావాలను స్పృశించాయి. వారంతా ఈ పిలుపును సాదరంగా ఆహ్వానించారు. రెండు ప్రభుత్వాలూ వేగంగా కదిలాయి. చర్చలు జరిపాయి. ఒలంపిక్ క్రీడలలో ఉత్తరకొరియా క్రీడా బృంద ప్రాతినిధ్యానికి వీలుగా అనేక ఇతర చర్యలు తీసుకున్నాయి. చర్చలు, సైనిక చర్చలు సాగించటం ద్వారా సమస్యలను పరిష్కరించు కొని, ఆకస్మిక విబేధాలను తొలగించుకోవాలని రెండు ప్రభుత్వాలూ అంగీకరించాయి. క్రీడాకారులు, ఉన్నతస్థాయి అధికారులు, ప్రోత్సాహక బృందాలు, కళాప్రదర్శకులతోపాటుగా విలేకరులు, వీక్షకులతో కూడిన ఒక పెద్ద ప్రాతినిధ్య బృందాన్ని క్రీడలలో పాల్గొనేందుకు పంపాలని ఉత్తరకొరియా నిర్ణయించుకుంది. ఒలంపిక్ క్రీడల సందర్భంగా జరిగే ప్రారంభ వేడుకలోనూ అలాగే ఇతర సంయుక్త కార్యకలాపాలలోనూ రెండు దేశాలకు చెందిన క్రీడాకారులంతా ఒకే జెండా క్రింద కవాతులో పాల్గొనటానికి రెండు ప్రభుత్వాలూ అంగీకరించాయి. కనీసం తాత్కాలికంగానే అయినా, ఉద్రిక్తతలు, అభద్రత, శత్రుత్వభావనలు తొలగినట్లుగా రెండువైపులా వున్న కొరియా ప్రజానీకం భావించారు. రెట్టించిన ఉత్సాహంతో క్రీడలను వీక్షించటానికి వారు సిద్ధమయ్యారు.

ఇది ఒక ఆహ్వానించదగిన పరిణామం. అయితే సమస్య మూలకారణం అలానే వుంది. అది ఉత్తరకొరియాతో ముడిపడి లేదు; అమెరికా సామ్రాజ్యవాదులతో ముడిపడి వుంది. కొరియా ద్వీపకల్పం మీద, ఆసియా-పసిఫిక్ ప్రాంతం మీద తమ ఆధిపత్యాన్ని నెలకొల్పేందుకు అమెరికా సామ్రాజ్యవాదులు అనుసరించే జోక్యందారీ విధానం, రాజకీయాలు-ఈ సమస్యకు మూల కారణంగా వున్నాయి. కొరియా ద్వీపకల్పంలో శాంతి పునరుద్ధరణను కోరుకునే వారెవరైనా, దీనికి వ్యతిరేకంగా గళం విప్పాల్సిందే.

oooooo